ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
18-6-2012 ● సోమవారం





సాహసం

**ఒకరికి బాల్యం నుంచీ కొండలు, గుట్టలు ఎక్కడం వంటిసాహసకృత్యాలు చేయడమంటే ఇష్టం. ఆ ఇష్టం నాన్న ఇచ్చిన స్ఫూర్తితో ఏర్పడింది. మరొకరికి ఎత్తుల్ని చూస్తేనే బెదిరిపోయే తత్వం. కాని కూతుళ్లు ఇచ్చిన ప్రోత్సాహంతో ఎత్తయిన పర్వతాల్ని కూడా అవలీలగా అధిరోహిస్తున్నారు. ఒకరికి పాత తరం, మరొకరికి కొత్త తరం ఇచ్చిన ప్రోత్సాహమే ఎవరెస్ట్ బేస్ క్యాంపుకి విజయవంతంగా వెళ్లొచ్చేలా చేసింది. మరో విశేషమేమిటంటే ఓ పక్క ఉద్యోగం, మరోపక్క కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే ఇద్దరూ 40 యేళ్ల వయసులో ఎవరెస్ట్ బేస్ క్యాంపుకి దిగ్విజయంగా వెళ్లి రావడం. వాళ్లు చెప్తున్న విశేషాలే ఇవి...**

# ఏళ్లు ఎన్నని కాదు... ఎవరెస్ట్ ఎక్కామా లేదా

## ఒక్కసారయినా అక్కడికి వెళ్లాలి

"నాన్న డిఫెన్స్‌లో పనిచేసేవారు. అందుకని మేము పూనెలో ఉండేవాళ్లం. ప్రతీ ఆదివారం నాన్నతో కలిసి బయటికి వెళ్లేదాన్ని. అప్పట్నించే కొండలు, గుట్టలు, పర్వతాల వంటివి ఎక్కమని ప్రోత్సహించేవారు నాన్న. అలా నాకు ఇరవై యేళ్లు వచ్చేవరకు వెళ్తుండేదాన్ని. ఆ తరువాత పై చదువులు, కెరీర్ వల్ల బ్రేక్ పడింది. అప్పుడు ఫుల్‌స్టాప్ పెట్టిన అడ్వంచర్ కార్యక్రమాలు రెండేళ్ల క్రితం 'గ్రేట్ హైదరాబాద్ అడ్వంచర్ క్లబ్'లో చేరడంతో మళ్లీ మొదలయ్యాయి.

ఎవరెస్ట్ బేస్ క్యాంపుకి వెళ్లడమనేది నా కల. ప్రపంచంలో ఉన్న అతికష్టమైన ట్రెక్స్‌లో ఇదొకటి. అడ్వంచర్ క్లబ్ నుంచి ప్రతీ ఏడాది నాలుగుసార్లు ఈ ట్రిప్ ఏర్పాటుచేస్తారు. ఈ ఏడాది ఏప్రిల్-మే సీజన్ ట్రెక్‌లో నేను వెళ్లాను. అక్కడికి వెళ్లిన టీంలో పన్నెండు మంది సభ్యులం ఉన్నాం. ఇద్దరు సౌదీ అరేబియా, ఇద్దరు పాకిస్తాన్, ఇద్దరు అమెరికాకి చెందిన వారు. మిగతా వాళ్లు మనవాళ్లు. అయితే మనసులోకి ఇలా ఆలోచన రాగానే అలా వెళ్లే టూర్ కాదు ఇది. ఎవరెస్ట్ వెళ్లే ముందు రెండు నెలల పాటు శరీరాన్ని అందుకు తగ్గట్టుగా తయారుచేసుకోవాలి. అందుకోసం ప్రత్యేకంగా వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. అక్కడికి వెళ్లాలనుకున్న మా హైదరాబాద్ బ్యాచ్ వాళ్లందరం కెబిఆర్ పార్కులో ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామాలు చేసేవాళ్లం. రోజూ ఒకే వ్యాయామాలు కాకుండా సైక్లింగ్, ఎియిరోబిక్స్ వంటి వ్యాయామాలు రోజుకొకటి చేశాం. ఈ పార్కులో ఒక దగ్గర వంద మెట్లు ఉంటాయి. ఆ మెట్లను పన్నెండు సార్లు ఎక్కి దిగేవాళ్లం. ఇలా చేయడం వల్ల ఎత్తులు ఎక్కే శక్తి వస్తుంది. అలా రెండు నెలల పాటు శిక్షణ తీసుకుని క్యాంప్‌కి సిద్ధం అయ్యాం.

ఎవరెస్ట్ బేస్ క్యాంపులో పద్దెనిమిది వేల అడుగుల వరకు వెళ్లాం. అయినప్పటికీ మా బ్యాచ్‌లో ఎవరూ అనారోగ్యం బారిన పడలేదు. తొమ్మిది వేల అడుగులకు చేరుకున్న తరువాత వాతావరణంలో ఆక్సిజన్ స్థాయి తగ్గిపోతుంది. ఆ వాతావరణానికి తగ్గట్టు శరీరం అడ్జస్ట్ అవ్వాలంటే కొంత సమయం పడుతుంది. ఒకవేళ శరీరం అందుకు తగ్గట్టుగా మారకపోతే 'ఎక్యూట్ మౌంటెన్ సిక్‌నెస్' బారిన పడతారు. అక్కడకు వెళ్లే ముందు మేము చేసిన వ్యాయామాల వల్లే ఆ వాతావరణాన్ని తట్టుకునే శక్తి వచ్చింది. తక్కువ ఆక్సిజన్‌కు శరీరం అడ్జస్ట్ అయ్యింది.



ఎవరెస్ట్ ప్రయాణం సాఫీగా సాగేందుకు మా టీం లీడర్ దియానాత్ అలీ ఎంతో సాయపడ్డారు. ముందుగానే ఆహారం, బట్టలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పారాయన. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు కూడా మాకు ఎటువంటి ఇబ్బంది కలిగించలేదు. రోజుకి ఆరేడు వందల అడుగుల ఎత్తుకి వెళ్లే వాళ్లం. పద్నాలుగు రోజుల పాటు నడిచినా అలసటే అనిపించలేదు. ఒక్కోసారి స్నానం కూడా చేసేవాళ్లం కాదు. అయినా చిరాకుగా అనిపించలేదు.

### ఆనందం.. ఆనందం..

ముందు ఢిల్లీ వెళ్లి అక్కడ్నించి నేపాల్ వెళ్లాం. ఖర్చు 70 నుంచి 80 వేల వరకు అవుతుంది. ఇన్నేసి రోజులు కుటుంబ, ఉద్యోగ బాధ్యతలు వదిలిపెట్టి వెళ్లాలంటే కష్టం కాబట్టే జీవితంలో ఒక్కసారి వెళ్లొస్తే చాలనుకుంటారు ఎక్కువమంది. ఈ ప్రయాణంలో పడిన శ్రమ ఏదైనా ఉంటే ఎవరెస్ట్ దగ్గరికి వెళ్లొచ్చామనే ఆనందం ముందు బలాదూర్.

ఎవరెస్ట్‌కి వెళ్లాలంటే మనసులో ఆ కోరిక బలంగా ఉండాలి. అంతేకాని ఎవరో చెప్పారని బయల్దేరొద్దు అనేది నా సూచన. అలా వెళ్తే మీకు కమిట్‌మెంట్ ఉండదు. అక్కడి ప్రకృతిని, ఆ అందాల్ని ఆస్వాదించలేరు. ఇష్టంతో వెళ్తే అరకొర ఇబ్బందులు ఎదురైనా ప్రకృతి అందాల్ని ఆస్వాదిస్తూ వాటిని సులభంగా మర్చిపోవచ్చు. మీరు ప్రకృతిని ఎంత ప్రేమిస్తే ప్రకృతి కూడా మీకంతే ప్రేమను అందిస్తుంది. హిమాలయాల సౌందర్యాన్ని చూసిన వాళ్లెవరయినా ఇది నిజమనక మానరు. జీవితంలో ఒక్కసారయినా ఎవరెస్ట్ బేస్ క్యాంపుకి వెళ్లడం తప్పనిసరి అంటాను నేను. పర్వతారోహణతో పాటు స్కూబా డైవింగ్ కూడా చేస్తాను నేను. మాల్దీవుల్లో నీళ్ల అడుగుకు 20 మీటర్ల వరకు డైవ్ చేస్తూ వెళ్లాను. పూనెలోని కామ్‌షెట్‌లో పారాగ్లయిడింగ్ చేశాను. నల్లమల, నరసాపూర్, సహ్యాద్రి హిల్స్, అనంతగిరి హిల్స్‌లో కూడా ట్రెక్కింగ్ చేశాను. నెలకి కనీసం రెండు ట్రిప్పులయినా ఇటువంటి సాహస కార్యక్రమాలకు వెళ్తుంటాను."

**- శ్యామలారావు, బ్రాండ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్**

## మా అమ్మాయిలే నా బలం

"నేను అడ్వంచర్ స్పోర్ట్స్ దిశగా అడుగుపెట్టడానికి కారణం మా పిల్లలే. వాళ్లే నాకు స్ఫూర్తి. ముఖ్యంగా మా పెద్దమ్మాయి లేఖ నాకెంతో ప్రోత్సాహాన్నిస్తుంది. తనిచ్చిన ప్రోత్సాహమే ఎవరెస్ట్ బేస్ క్యాంపుకి వెళ్లేలా చేసింది. నేను ఇంతకు ముందు ఎంత సాహసవంతురాలినో చెప్పాలంటే మీకో ఉదాహరణ చెప్పాలి. ఒకసారి మా కుటుంబమంతా కలిసి మలేషియా వెళ్లాం. మా పిల్లలు అక్కడ 2000 అడుగుల పైకి స్పేస్ షటిల్ లాంటి దానిలో వెళ్లారు. వాళ్లు చేసే ఇటువంటి సాహసాలని ఫోటోలు, వీడియోలు తీయడం నాకు అలవాటు. అలానే ఆ ఈవెంట్‌ను కింద నిల్చొని వీడియో తీస్తున్న నాకు కళ్లు తిరిగి వాంతులయ్యాయి. అలాంటిది ఇప్పుడు నేను నాలోని భయాలన్నీ పక్కనపెట్టి ఏకంగా పర్వతాల్నే ఎక్కుతున్నాను.

### ర్యాప్లింగ్ ఇచ్చిన విశ్వాసం

బాల్యం నుంచీ ప్రకృతి అంటే బోలెడంత ఇష్టం నాకు. వాకింగ్ చేయడమన్నా, సూర్యోదయాలు చూడడమన్నా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. నా పిల్లల ప్రోత్సాహంతో 'గ్రేట్ హైదరాబాద్ అడ్వంచర్ క్లబ్'లో చేరాను. ఇందులో చేరాక మొట్టమొదట ర్యాప్లింగ్ (తాడు సహాయంతో పైనుంచి కిందకు దిగడం) చేశాను. అలా నా అడ్వంచర్ స్పోర్ట్స్‌కి నాంది పడింది. అది చేసిన రోజున విపరీతమైన తలనొప్పి వచ్చింది. అది కూడా నాలో ఉన్న భయం వల్లే తప్ప మరేమీ కాదనిపించింది ఆ తరువాత. ఇప్పుడు మౌలాలిలో ర్యాప్లింగ్ చేయడమంటే ఎంత ఇష్టమో మాటల్లో చెప్పలేను. ర్యాప్లింగ్ చేసిన కొన్నాళ్ల తరువాత చిమ్నీక్లయింబింగ్ చేశాను. అంటే రెండు రాళ్ల మధ్య నుంచి ఎక్కుతూ పైకి పాకడం. చిమ్నీక్లయింబింగ్ మొదటిసారి చేసేవాళ్ల నడుముకి తాళ్లు కట్టి పైకి ఎక్కిస్తారు. ఆ తరువాత మాత్రం తాళ్లు అవీ లేకుండానే చేతులతో గబగబా పాకగల నేర్పు వస్తుంది. ఈ మధ్య 'ఆస్ట్రేలియన్ ర్యాప్లింగ్' చేశాను. ఇందులో నడుముకి తాళ్లు కట్టుకుని, ర్యాప్లింగ్‌కి రివర్స్‌లో అంటే నేలవైపు ముఖంపెట్టి కిందకి దిగుతాం. ఇదీ అంతే మొదట్లో భయమనిపించింది. ఆ తరువాత మాత్రం మళ్లీ మళ్లీ చేయాలనిపించింది. ఒకరకంగా ర్యాప్లింగ్ నాలో బోలెడు ఆత్మవిశ్వాసాన్ని నింపిందని చెప్పొచ్చు.

ఇవే కాకుండా 'వైట్ వాటర్ రాఫ్టింగ్'ను 'దండేలి'లో లోతైన నీళ్లలో చేశాను. ఇది చేసే ఓ పావుగంట ముందు సేఫ్‌గార్డ్స్ వేసి మనకు నీళ్లలో శిక్షణ ఇస్తారంతే. తరువాత మనం వెళ్లిపోవడమే. అయితే ఇందులో పాల్గొనాలంటే మాత్రం ఈత వచ్చి ఉండాలి. మా చిన్నమ్మాయి స్ఫూర్తితో ఈత నేర్చుకున్నాను. నేను ఏదయినా చేయాలని అనుకుంటానో లేదో దాన్ని అమలుచేసే ప్రోత్సాహాన్ని మా ఇద్దరమ్మాయిలు ఇస్తారు.

### ప్రతీ క్షణం ప్రకృతిలో...

అడ్వంచర్ క్లబ్‌లో చేరక ముందు స్నేహితుల ద్వారా ఎవరెస్ట్ బేస్ క్యాంపు గురించి విన్నాను. కాని నేనే అక్కడికి వెళ్తాను అని మాత్రం అనుకోలేదు. నేను అక్కడికి నవంబర్‌లో వెళ్లాను. మూడు వారాల ట్రిప్ ఇది. బేస్ క్యాంపుకు వెళ్లే మూడు నెలల ముందు నుంచీ దియానాత్ అలీ ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేశారు. వాటికి మిస్ కాకుండా హాజరయ్యాను. అందుకే అక్కడి వాతావరణాన్ని బాగా ఎంజాయ్ చేయగలిగాను. దీంతో పాటు ప్రకృతిని ఎంజాయ్ చేసే తత్వం కూడా ఉండాలి. బేస్ క్యాంపు తరువాత కాలాపత్తర్ వెళ్లాం. అదెక్కి ఎవరెస్ట్ శిఖరాన్ని చూస్తుంటే ఎంత బాగుందో మాటల్లో వర్ణించలేను. ఎవరెస్ట్ పరిసరప్రాంతాల్లోకి వెళ్లిన దగ్గర్నించీ ప్రతీ అంశాన్ని ఎంతో అపురూపంగా నా మనసులో దాచుకున్నాను. అక్కడ ఉన్న సమయంలోనే మా పెద్దమ్మాయి లేఖ ఫోన్ చేయడం ఇంకా ఎంతో ఆనందాన్నిచ్చింది. ఫోన్ సిగ్నల్స్ కలిసి అక్కడ తనతో మాట్లాడడం నా అదృష్టం. ఎందుకంటే తనే గాని వెళ్లమనకపోతే నేను ఆ ట్రిప్‌కి వెళ్లే దాన్ని కాదు. తను ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూ, ఐఐటికి ప్రిపేరవుతోందప్పుడు. అందుకని పరీక్షలు అయిన తరువాత ఏప్రిల్‌లో వెళ్దామనుకున్నాను. మా ఆయన కూడా అదే బెటరన్నారు. అది విన్న మా పెద్దమ్మాయి మాత్రం "పరీక్షలు రాసేది నేను కాని నువ్వు కాదు కదా. అందులోను నీకు నవంబర్ సీజన్‌లో మంచు కురిసేటప్పుడు చూడడటమంటే ఇష్టం కదా వెళ్లు" అన్నది. అలా లేఖ స్ఫూర్తినిస్తుంటే నా చిన్న కూతురు నవ్య ఇంటి విషయాల్లో ఎంతో సాయం చేస్తుంటుంది.



ఎవరెస్ట్ బేస్ క్యాంపుకి వెళ్లా కాని అంత తృప్తిగా అనిపించలేదు. అందుకే కుటుంబంతో కలిసి ఈసారి నాలుగు నెలల ట్రిప్ ప్లాన్ చేద్దామనుకుంటున్నాను. అక్కడికి వెళ్లే అవకాశం ఒక్క శాతం ఉన్నా ఆ అవకాశాన్ని వదులుకోవద్దు. ఎందుకంటే రేపు ఏం జరుగుతుందో తెలియదు. జీవితంలో లభించే ఏ క్షణాన్నీ వదలకుండా పూర్తిగా జీవించాలనేది నా సిద్ధాంతం."

**- కిరణ్మయి, ప్రిన్సిపాల్, నారాయణ కళాశాల, హైదరాబాద్**

**● సేకరణ: కిరణ్మయి**